కేసీఆర్‌ను కలిసిన పలువురు నేతలు



మేడ్చల్‌రూరల్: మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను బుధవారం మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్ కలిశారు. ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో బీఆర్‌ఎస్ మేడ్చల్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ డైరెక్టర్ శంకర్‌తో కలిసి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పైపులైన్ పనులను త్వరగా పూర్తిచేయాలి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈ మేనేజర్, ఎంపీడీఓ అరుణారెడ్డితో నీటి సరఫరాపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాచివానిసింగారం, ప్రతాపసింగారం, చౌదరిగూడ, కొర్రెముల్, నారపల్లిలో జరుగుతున్న పైపులైన్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ నందకిశోర్, ఏఓ బాసిత్ పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం

జవహర్‌నగర్: బాలుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ బీరప్పగడ్డలో బండారి సుధాకర్, భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. పెద్ద కుమారుడు బండారి రాహుల్(12) 7వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లో నుంచి ఫోన్ తీసుకొని బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డికి.. సమస్యల స్వాగతం

- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- మేడ్చల్‌లో కరువైన డిగ్రీ, జూనియర్ కళాశాలలు
- అన్ని మండలాల్లో సమస్యలకు పరిష్కారమెప్పుడో..?

రెండోసారి మేడ్చల్ ఎమ్మెల్యేగా మల్లారెడ్డి





నిలిచిపోయిన మేడ్చల్ స్టేడియం పనులు

మేడ్చల్: మేడ్చల్‌కు మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్లారెడ్డికి నియోజకవర్గ పాత సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని డిగ్రీ, జూనియర్ కళాశాలలు, ఆట స్థలాలు, ఇళ్ల స్థలాలు, జవహర్‌నగర్ డంపింగ్ యార్డు, గ్రామ కంఠం, తాగునీరు, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలు ఎమ్మెల్యే మల్లారెడ్డికి స్వాగతం పలుకుతున్నాయి.

మేడ్చల్ మండలంలో..

మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం, 20 ఏళ్లుగా నిర్మిస్తున్న స్టేడియం ప్రారంభమైనా అందుబాటులోకి రాకపోవడం, పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకపోవడం ప్రధాన సమస్యలు.

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పరిశ్రమల ఏర్పాటు, పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు, గుండ్లపోచంపల్లి అపరెల్ పార్క్‌ను అభివృద్ధి చేయడం వంటి అంశాలను పరిష్కరించాల్సి ఉంది. శంకుస్థాపనకే పరిమితమైన కండ్లకోయ ఐటీ పార్క్ ప్రారంభం చేయడం, గౌడవెళ్లి వద్ద అసంపూర్తిగా ఉన్న ఔటర్ రింగు రోడ్డు సర్వీసు రోడ్డు పూర్తి చేయించడం, బస్టాండ్ ఆధునీకరణ, పరిష్కరించడం వంటి ఎన్నో సమస్యలు పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయి.
- మండలంలోని పలు గ్రామాల్లో, రావల్‌కోల్, గిర్మాపూర్ గ్రామాల్లో క్రషర్ మిషన్లు ఉండటంతో వాటి వాహనాల ద్వారా దుమ్మూ, దూళి ఏర్పడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. అవస్థలు పడుతున్న సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.

కీసర మండలంలో సమస్యలు

తెలంగాణ జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన కీసరగుట్ట దేవాలయ అభివృద్ధి చేపట్టాల్సిన అవసరం ఉంది. గతంలో కీసరగుట్టలో సుమారు రూ.70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాధనలు సిద్ధం చేసింది. ఇప్పుడైనా కొత్త ఎమ్మెల్యే మల్లారెడ్డి అయినా కీసరగుట్ట అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. క్రీడాస్టేడియం, జూనియర్ కళాశాల, బస్ డిపో, కీసరగుట్టలో క్రీడా స్టేడియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఘట్‌కేసర్ మండలంలో..

గురుకుల్ భూములను రక్షించాలి. ఏళ్లుగా ఊరిస్తున్న రైల్వే వంతెన పనులను పూర్తి చేయాలి. ఘట్‌కేసర్‌లో జూనియర్, డిగ్రీ కళాశాల, మినీ స్టేడియం, ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేయాలి. ఘట్‌కేసర్–కీసర రోడ్డు, ఘట్‌కేసర్–నాగారం రోడ్డును వెడల్పు చేసి డివైడర్లను నిర్మించాలి. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలి. రైల్వే వంతెన, ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలను నాయకులెవరూ పట్టించుకోవడం లేదు.



ఘట్‌కేసర్‌లో నిలిచిన రైల్వే వంతెన పనులు

జవహర్‌నగర్‌లో..

డంపింగ్ యార్డు సమస్య, గ్రామకంఠ స్థల సమస్యను పరిష్కరించి అందరికీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ సమస్య పరిష్కారానికి ఏళ్లుగా జవహర్‌నగర్ వాసులు ఎదురు చూస్తున్నారు.

శామీర్‌పేట్‌లో..

మండలకేంద్రంలో అర్ధాంతరంగా నిలిచిన శామీర్‌పేట మినీ స్టేడియం ఎమ్మెల్యే మల్లారెడ్డి ముందున్న ప్రధాన సమస్య. శామీర్‌పేట్ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం, రోడ్లను అభివృద్ధి చేయడం ప్రధాన సమస్యలు. ఐదేళ్ల నుంచి మేడ్చల్ ఎమ్మెల్యేగా ఉంటూ మంత్రిగా కొనసాగిన మల్లారెడ్డి రాబోయే ఐదేళ్లలో మిగిలిన సమస్యలను పరిష్కరిస్తారో లేదో చూడాలి. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మేడ్చల్‌లో నైతిక విజయం నాదే..

- కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్
- మాజీ మంత్రి మల్లారెడ్డి కోట్లు పంపిణీ చేసి గెలిచాడు
- 150 కేసులు నమోదైన మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో నైతిక విజయం తనదేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఐదేళ్లు ఎంపీగా, మరో ఐదేళ్లు మంత్రిగా పనిచేసిన చామకూర మల్లారెడ్డి మేడ్చల్ జిల్లాలోని రైతుల భూములను అక్రమంగా ఆక్రమించి, దోచుకుని, దాచుకున్న రూ.వందల కోట్లు పంపిణీ చేసి గెలిచారని, అది గెలుపే కాదని ఆరోపించారు. బుధవారం బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, ఓట్లు కొనుగోలు చేసి గెలిచిన మల్లారెడ్డి గెలుపు గెలుపేనా.. అని విమర్శించారు. ఆ గెలుపు ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఈ ఎన్నికల్లో డబ్బుల పంపిణీ, బెదిరింపుల చర్యల వల్ల మల్లారెడ్డిపై 150 కేసులు నమోదయ్యాయని, ఆయన దాఖలు చేసిన అఫిడవిట్‌లో పోలీస్ కేసుల వివరాలు, ఆస్తుల వివరాలు సరిగ్గా పొందుపర్చలేదని, అందువల్ల మల్లారెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మల్లారెడ్డి అనుచరులు మా కార్యకర్తలను కూడా బెదిరించారని ఆయన ఆరోపించారు. నీతి, నిజాయితీగా ప్రజలకు సేవచేసి ఉన్నట్లయితే మల్లారెడ్డి ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా గెలవాల్సింది అన్నారు. ఈ ఎన్నికల్లో తనకు ఓటు వేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. రాబోయే పంచాయతీ, మండల, మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసే నిధులు, ఆరు గ్యారంటీ పథకాలను నియోజకవర్గంలోని ప్రజలకు ముందుండి అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యల పరిష్కారం

మేడ్చల్ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

శామీర్‌పేట్: నూతన ప్రభుత్వ ఏర్పాటు అనంతరం సమస్యల పరిష్కారం వేగవంతం చేయనున్నట్లు మేడ్చల్ జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ హారిక అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖలకు సంబంధించిన సమస్యలను సభ్యులు సభా దృష్టికి తీసుకువచ్చారు. మూడుచింతలపల్లి మండలంలో ధరణితో భూసమస్యలు అధికంగా ఉన్నాయని, నూతన సీఎం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి వివరించారు. సమావేశంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీడీఓ వత్సలదేవి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పలువురు సభ్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

జవహర్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం సంతోషకరమని, అధికారంలోకి వచ్చాక మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న రేవంత్‌రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

డా.అంబేడ్కర్‌కు ఘన నివాళి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని మేడ్చల్‌లో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ కార్యక్రమాల్లో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. – మేడ్చల్



మేడ్చల్ నివాళులర్పిస్తున్న నేతలు



కీసరలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ తదితరులు



ఘట్‌కేసర్‌లో చైర్ పర్సన్ పావనీజంగయ్య, అరుణ్‌కుమార్



మునీరాబాద్‌లో సర్పంచ్ గణేశ్, ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు, మాజీ సర్పంచ్ రాగజ్యోతి



నాగారం మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు



మూడుచింతలపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



జవహర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు



జవహర్‌నగర్ కాంగ్రెస్ నాయకులు, మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు



అన్నోజిగూడలో కౌన్సిలర్ చింతల రాజశేఖర్



ఉద్దమర్రిలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో..



జెడ్పీ చైర్మన్‌పై అవిశ్వాసానికి సిద్ధం

- ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన శరత్ చంద్రారెడ్డి
- కోడ్ ముగియగానే లేఖ ఇచ్చిన బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలు
- ఐదుగురు సభ్యులతో మేడ్చల్ జిల్లా పరిషత్
- చైర్మన్ పదవిపై బీఆర్‌ఎస్‌లో వర్గపోరు
- మళ్లీ అవిశ్వాసం లేఖతో స్థానికంగా చర్చ

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డిపై మళ్లీ బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలు అవిశ్వాస తీర్మానానికి సన్నద్ధం కావడంతో జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతున్న తరుణంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల ప్రచారం నిర్వహించారన్న ఆగ్రహంతో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలపై ఒత్తిడి పెంచి జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు జిల్లా కలెక్టర్‌కు లేఖ ఇప్పించడం వంటి విషయాలపై స్థానికంగా వాడీవేడి చర్చ కొనసాగుతోంది.

- బీఆర్‌ఎస్‌కు చెందిన జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు తన తండ్రి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే, కాంగ్రెస్ గెలుపు కోసం ఎన్నికల ప్రచారం కూడా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో శరత్‌చంద్రారెడ్డి చేరడంపై బీఆర్‌ఎస్ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి. జెడ్పీ పాలకవర్గం పదవి కాలం వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకు ఉంది. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరనున్న వేళ శరత్‌చంద్రారెడ్డిపై అవిశ్వాసంపై నోటీసు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

బీఆర్‌ఎస్‌లో వర్గపోరు

జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే మేడ్చల్ జెడ్పీటీసీ శైలజను చైర్‌పర్సన్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉండగా, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశంతో సహా శామీర్‌పేట జెడ్పీటీసీ అనిత కూడా చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. అయితే.. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆశీస్సులు మాత్రం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మేడ్చల్ జెడ్పీటీసీ శైలజకు అనుకూలంగా ఉండటంతో.. ఆమెకే జెడ్పీ పీఠాన్ని కట్టబెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పార్టీలో ప్రచారం సాగుతోంది. రేసులో ఉన్న జెడ్పీ వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం శామీర్‌పేట జెడ్పీటీసీ అనిత మాజీ మంత్రి మల్లారెడ్డిపై గుర్రుగా ఉన్నట్లు వారి అనుచర వర్గాల్లో చర్చ సాగుతోంది. వీరు కూడా చైర్మన్ రేసుకు సిద్ధమవుతున్నట్లు బీఆర్‌ఎస్‌లో ప్రచారం సాగుతోంది.

ఐదుగురి సభ్యులతో జెడ్పీ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం ఐదుగురు జెడ్పీటీసీలు ఉన్నారు. వీరిలో మూడు చింతలపల్లి జెడ్పీటీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందగా, ఘట్‌కేసర్ నుంచి జెడ్పీటీసీగా గెలుపొందిన శరత్ చంద్రారెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నుంచి కీసర మండల జెడ్పీటీసీ, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్‌తో పాటు మేడ్చల్, శామీర్‌పేటల నుంచి జెడ్పీటీసీలు శైలజ, అనిత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జెడ్పీటీసీలలో అవిశ్వాసం నెగ్గాలంటే ముగ్గురు జెడ్పీటీసీలు ఉంటే సరిపోతోంది. దీంతో ముగ్గురు సభ్యులతో జెడ్పీ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గుతుందని బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

గతంలోనే అవిశ్వాసానికి సిద్ధమై..

బీఆర్‌ఎస్‌లో జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి ఉన్నప్పుడే ఆయనపై అవిశ్వాసం పెట్టేందుకు మాజీ మంత్రి మల్లారెడ్డి సూచన మేరకు ముగ్గురు జెడ్పీటీసీలు ప్రయత్నించారు. అయితే.. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడంపై పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుందని, నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించటంతో మల్లారెడ్డి జెడ్పీటీసీలను సముదాయించి అవిశ్వాస తీర్మాన నిర్ణయాన్ని వాయిదా వేయించారు. అలాగే, బెస్త వెంకటేష్‌ను జెడ్పీ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేయించాలని కూడా ప్రయత్నించారు. వైస్ చైర్మన్ పదవిలో ఉండగా, జెడ్పీ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశ పెట్టినట్లయితే వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం జెడ్పీ చైర్మన్ అయ్యే అవకాశాలు ఉంటాయని అంచనా వేశారు. ఇదిలా ఉండగా, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు.. జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరడం.. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మేడ్చల్ బరిలో నిలిచిన మల్లారెడ్డికి వ్యతిరేకంగా పనిచేశారు. దీంతో ఎన్నికలు ముగియగానే జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డిపై అవిశ్వాసం అంశాన్ని బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలు మరోసారి తెరపైకి తెచ్చారు. అందులో భాగంగానే అవిశ్వాస తీర్మానంపై నోటీసుకు సంబంధించిన లేఖను బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలు కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులకు అందజేశారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు



నాగారం మున్సిపాలిటీ సర్వే నంబర్ 83లో సూచిక బోర్డు ఏర్పాటుచేస్తూ..

కీసర: మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణతో పాటు సీలింగ్ భూమలను అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్–83లో గల సీలింగ్ భూమిని కొందరు వ్యక్తులు అన్యాక్రాంతం చేసేందుకు యత్నిస్తున్నారన్న సమాచారం మేరకు సదరు స్థలాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ సూచిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా కొంత భాగంలో కొన్ని నిర్మాణాలు చేపట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, త్వరలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ, సీలింగ్ భూముల్లో అక్రమార్కులు చేపట్టిన నిర్మాణాలను గుర్తిస్తామని, సదరు నిర్మాణాలను కూడా త్వరలో కూల్చివేసి ప్రభుత్వ, అసైన్డ్ స్థలాలను పరిరక్షిస్తామన్నారు. ఆర్‌ఐ కిషోర్ పాల్గొన్నారు.

